ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

బుధవారం | జూన్ 17, 2026 | సంపుటి : 7 | సంచిక : 17 | పేజీలు : 2

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

2 లో

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

సబ్సిడీపై సన్నాలు

ఏడు రకాల వరిధాన్యం విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి

- విత్తనాల నుంచి పంట కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళిక
- అదనపు కలెక్టర్లకు యూరియా పంపిణీ బాధ్యత అప్పగించాలి
- వ్యవసాయ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆయుధం: విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

రైతుల వివరాల నమోదు :

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం అదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు.

7 రకాల సన్న ధాన్యం విత్తనాలు

కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం :

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ,

తెలంగాణ అభివృద్ధిపై మా కెవరూ

పాఠాలు చెప్పనక్కర్లేదు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఢిల్లీ, ఆయుధం: దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను పద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉందొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు.

మాకు రేవంత్ సర్టిఫికెట్ అవసరం లేదు

''తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్ 1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు.

తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడా

తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్ 2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలే. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం'' అని కిషన్‌రెడ్డి వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై నేడు రైతుల అవగాహన సదస్సు

వరంగల్, ఆయుధం: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం విజయవంతంగా "12 సంవత్సరాల విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం" పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకి అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి తెలిపారు.17న బుధవారం మామునూరు వ్యవసాయ క్షేత్రంలో "ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత" అనే అంశంపై ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి (సంఘటన మంత్రి) చంద్రశేఖర్ తివారి జి వి చ్చేయనున్నారు. ఈ సందర్భంగా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం వద్ద రైతు సదస్సు సభా ఏర్పాటు వేదిక, రైతు ప్రాంగణాన్ని పరిశీలించారు. మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు దండు కిషన్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు 50 సైకిళ్ల పంపిణీ

ములుగు, ఆయుధం: రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి బాలికలకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు ములుగు కలెక్టర్ కార్యాలయ సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమానికి రోటేరియన్ కోరే చంద్రమౌళి (రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్), హైదరాబాద్‌కు చెందిన రోటేరియన్ మలపాటి మల్లికార్జున్ రెడ్డి సహకారంతో పాటు సాయి వంశీ ప్రాజెక్ట్స్ సంస్థ తమ CSR నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా, ములుగు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, IAS గౌరవ అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు నడిచి వచ్చే బాలికలకు సమయం ఆదా కావడంతో పాటు వారి విద్యాభివృద్ధికి ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ గతంలో మంగపేటలో 100 సైకిళ్ల పంపిణీ చేయడంతో పాటు, ఇటీవల పేద కుటుంబాలు స్వయం ఉపాధితో జీవనం సాగించేలా 50 కుట్టు మిషన్లను కూడా అందజేసిన సేవలను

గుర్తు చేస్తూ క్లబ్ సభ్యులను అభినందించి సన్మానించారు. అనంతరం క్లబ్ ప్రతినిధులు మంత్రి సీతక్క ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ అధ్యక్షులు గణేష్ కుమార్, కార్యదర్శి పొన్న హరినాథ్, కోశాధికారి కుమార్, బేతి అశోక్ బాబు, అనిల్, రత్నాకర్, కిరణ్, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌కు సహకరించాలి

- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ కె. రవి

బొద్దున వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

హనుమకొండ, ఆయుధం: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన బొద్దున వెంకటేశ్వర్లును వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి ఘనంగా సన్మానించారు. వరుసగా రెండోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ వాయిస్ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా కేశవమూర్తి మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన బొద్దున వెంకటేశ్వర్లును వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవ మూర్తి ఘనంగా సన్మానించారు. వరుసగా రెండోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ వాయిస్ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా కేశవమూర్తి మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సంఘం పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ఎస్.రాకేష్, అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ అధ్యక్షులు పెరుమాండ్ల తిరుపతి, సహాయ కార్యదర్శి బూర వెంకటేష్, సిహెచ్. సాంబయ్య, ఎం.డి.యూస్ముద్దీన్, పి.హనుమాచారి శుభాకాంక్షలు తెలిపారు.

హామీలు నెరవేర్చకుంటే ప్రభుత్వంపై

తిరుగుబాటు తప్పదు

- ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే
- గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హనుమకొండ, ఆయుధం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మారలేదని అన్నారు. పేదలు సి పిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల (మిగతా 2లో..)

రాజీతో సమస్యను పరిష్కరించుకోండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

వరంగల్, ఆయుధం: ఈ నెల 20వ తేదీ శనివారం జరిగే రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ జాతీయ మెగా లోక్ అదాలత్ సంబంధించి వరంగల్ కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ శనివారం రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమం వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, పరకాల ఇన్స్‌స్పెక్టర్ క్రాంతికుమార్, దామెర ఎస్.ఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే...
పోలీసులకు సమాచారం ఇవ్వండి

- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్, ఆయుధం: ప్రజల భద్రతే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. తమ పరిసరాల్లో ఎవరైనా గుర్తు తెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సీసీఎస్ (CCS) పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనుమానితుల తనిఖీలను పోలీస్ కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా తనిఖీల్లో పాల్గొని పోలీసుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన కొందరు నేరస్థులు వరంగల్ నగరానికి చేరుకుని ఇళ్ల చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, ఇతర ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలను కలిపే ప్రధాన రైల్వే జంక్షన్లుగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు ఉండటంతో నేరస్థులు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకుని నేరాలకు పాల్పడి, అనంతరం తిరిగి తమ స్వస్థలాలకు వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ తరహా నేరాలను అరికట్టేందుకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిలో రెండు బృందాలు వరంగల్ రైల్వే స్టేషన్‌లో, మరో రెండు బృందాలు కాజీపేట రైల్వే స్టేషన్‌లో ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. తనిఖీల సమయంలో ఎవరైనా వ్యక్తి గతంలో నేరాలకు పాల్పడినట్లు రికార్డుల్లో ఉన్నట్లయితే, పోలీసుల వద్ద ఉన్న సాంకేతిక పరికరాల ద్వారా క్షణాల్లో ఆ వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అటువంటి సందర్భాల్లో వెంటనే అప్రమత్తమై సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. అదేవిధంగా తనిఖీల సందర్భంగా సేకరించిన అనుమానితుల వివరాలను రికార్డుల రూపంలో భద్రపరుస్తున్నామని, నాలుగు మంది సభ్యులతో కూడిన ప్రతి ప్రత్యేక బృందం షిఫ్టుల వారీగా నిరంతరం విధులు నిర్వహిస్తూ అంతర్ రాష్ట్ర నేరస్థుల కదలికలపై నిఘా ఉంచుతోందని కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీల్లో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, జీఆర్‌పీ డీఎస్పీ కృపాకర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, కాజీపేట ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ అభినవ్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే ప్రభుత్వంపై
తిరుగుబాటు తప్పదు

(మొదటి పేజీ తరువాయి..)

భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొనవద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయని అన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణాకే విముక్తి జరిగేది కాదని అన్నారు. గుండ్ల సింగారంలో ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని, కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడిసెవాసులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కాలనీలో కరెంట్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కరె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కరె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, శనిగరపు రాజు కుమార్, కొట్టే వెంకటేష్, వేల్పుల సారంగపాణి, అనుకారి అశోక్, రాసమల్ల దినా, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు మాదాసి కళ్యాణ్, గాదె రాజన్న, కట్కూరి కృష్ణ, జన్ను కృష్ణ, నాయకులు పోసుగోటి రాము గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, కొడెపాక బాబు, మామూనూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు గడ్డం రాజనర్సు, రోంటాల శ్యామ్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, ప్రముఖ సినీ గాయకుడు ఇమ్మడి అశోక్ పాటలు, మహిళల కోలాట నృత్యం ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

- ఖమ్మం బాలిక పై అత్యాచారం, హత్యాయత్నం కేసుపై వరంగల్‌లో రజక సంఘాల నిరసన ర్యాలీ

వరంగల్, ఆయుధం: ఖమ్మం జిల్లాలో 12 ఏళ్ల రజక బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్నం ఘటనను ఖండిస్తూ రజక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్‌లో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి బాధితురాలికు టుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడు ఎం.డి.గౌస్ పాషాపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో వేగంగా విచారణ జరిపి మరణదండన విధించాలని కోరారు. రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అట్రాసిటీ చట్టాన్ని అమలు చేసి రజకులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సూతనకంటి ఆనందం, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల భిక్షపతి, ఐఎంఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ చల్లగురుగుల దళపతి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వరాజు రాజ్‌కుమార్, వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్త కొండ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు శనిగరం శ్రీధర్, మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమార్, జిల్లా నాయకులు భోగి సురేష్, దొడ్డిపాటి శేఖర్, చాగంటి ఓం ప్రకాష్, కంద్రాతి రమేష్, కొత్తపల్లి రాజు, ఐలోని శంకర్, నాగపురి మొగిలి, ఐలోని రాజు, ఐలోని వెంకటేశ్వర్లు, రాముల బాబు, కొత్తకొండ శీను, ఐలోని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌కు సహకరించాలి

హనుమకొండ, ఆయుధం: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్ 2026)ను రాజకీయ పార్టీలకతీతంగా పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. రవి కోరారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో వరంగల్ వెస్ట్ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితా రూపకల్పనలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే సమయంలో అనర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో కొనసాగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

వర్షా కాలం నాటికి 90 శాతం పనులు పూర్తి చేస్తాం

- శంకుస్థాపనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం
- 61వ డివిజన్లో కోటి రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, ఆయుధం: కాజీపేట 61వ డివిజన్‌లోని వెంకటాద్రి నగర్, ప్రశాంత్ నగర్ లలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం నాటికి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 90 శాతం పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. శంకుస్థాపనలు చేయడం, ప్రారంభోత్సవాలు నిర్వహించడం వరకే తమ బాధ్యత కాదని, నిర్ణీత గడువులో పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి పనికి కాలపరిమితి నిర్ణయించి, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వాల మాదిరిగా హామీలకే పరిమితం కాకుండా పనులు చేసి చూపిస్తున్నామని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాజీపేట రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులను వేగవంతం చేశామని, త్వరలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కాజీపేట బస్‌స్టాండ్ నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. గడిచిన రెండున్నర సంవత్సరాలుగా నగరంలో ఎటువంటి భూ కబ్జాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అన్ని ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల హంటర్ రోడ్ లో కొందరు వ్యక్తులు చేసిన ఉదాంతం ప్రజలు గమనించారని తెలిపారు.

వైఎస్సార్ నగర్ సంబంధిత అంశంపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ నిర్వహిస్తోందని చెప్పారు. ప్రైవేట్ భూములకు సంబంధించి కోర్టు తీర్పు అంతిమమని, ప్రభుత్వం న్యాయపరమైన నిర్ణయాలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. భూమి ప్రభుత్వ స్థలమని తేలితే ఒక్క గజం కూడా ఆక్రమణకు గురికాకుండా కాపాడుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అవసరమైతే ఆ స్థలంలో బస్‌స్టాండ్, పోలీస్ స్టేషన్ లేదా ఇతర ప్రజాప్రయోజన కార్యక్రమాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. గతంలో జరిగిన భూ ఆక్రమణలపై స్పందించని ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు రాజకీయ విమర్శలు చేయడం సమంజసం కాదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బిజెపి నాయకులు చేస్తున్న ఆరోపణలు ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు గత ప్రభుత్వ హయాంలో ఆనాటి పాలకులు తమ సొంత పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ విలువైన భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినప్పుడు ఈ బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగరిక రమాకాంత్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గాజుపాక రమేష్, స్థానిక నాయకులు, అధికారులు రాజ్ కుమార్, హరికుమార్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- మర్కజి ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- విద్యాబోధన, వేసవి సెలవుల అనుభవాలపై ఆరా

హనుమకొండ, ఆయుధం: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. పాఠశాలలో విద్యా బోధన, హాజరు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) విధానంలో హాజరు నమోదు చేస్తున్నారా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. పూర్వ ప్రాథమిక తరగతిని సందర్శించిన కలెక్టర్, చిన్నారులు ఏమి నేర్చుకుంటున్నారో తెలుసుకున్నారు. రాగి జావా తీసుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కున్నారా అని అడిగారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వేసవి సెలవులను ఎలా గడిపారు, ఏవైనా క్రీడలను అభ్యసించారా అని ప్రశ్నించారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమైన తర్వాత ఎలా అనిపిస్తోందని విద్యార్థులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యా బోధనకు ఉపయోగించే పాఠ్య సామగ్రిని జాగ్రత్తగా సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఖాన్ అకాడమీ పాఠాలను క్రమం తప్పకుండా వినాలని, వాటిని విద్యాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులతో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలలో నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

వరంగల్, ఆయుధం: సుఖినోభవంతు ట్రస్ట్ హైదరాబాద్ వారు చింతల్ చంద్రవదన కాలనీ లో పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రత్నప్రభ, నిర్మల, సత్యనారాయణ రెడ్డి, సత్యవతి, రమాదేవి, సునీత, కాకతీయ రుద్రమాంబ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు భైరవైన సరోజనా యాదవ్, రజియా సుల్తానా పాల్గొన్నారు. గత 8 సంవత్సరాలుగా వోల్టేజ్ హోములకు, ఒంటరి మహిళలకు, ఆటోలకు, స్కూల్ ఫీజులు, మెడికల్ క్యాంపులు లాంటి సహాయాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం విజయవంతంగా జరిపించిన నిర్మల కు సుఖినోభవంతు ట్రస్ట్ వారు అభినందనలు తెలిపారు.

రైతులపై ఆర్థిక భారం తగ్గించి సౌకర్యాలు కల్పించాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్

వరంగల్, ఆయుధం: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, లక్ష్మిపురం పండ్ల మార్కెట్, కూరగాయల మార్కెట్ కు పంటలను తీసుకొచ్చిన రైతుల ఖర్చులను కమిటీ భరించి, సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర ప్రియాంక కు ఏనుమాముల మార్కెట్, లక్ష్మిపురం పళ్ళ మార్కెట్, కూరగాయల మార్కెట్ సమస్యల పై మెమొరండాన్ని సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ రైతులు పంటలు పండించడం మరొక్క ఎత్తు పండిన పంటను మార్కెట్లోని అమ్ముకోవడం ఇబ్బందులకు గురి అవుతున్నాడు పంటను మార్కెట్కు తీసుకువచ్చిన సమయంలో పంటకు రక్షణ కల్పించకపోవడం వర్షాలకు పంట నానే పరిస్థితి అంతేకాకుండా మార్కెట్కు తీసుకొచ్చిన పంటకు సరైన ధరను అందించకపోవడం అనేక రకాల ఖర్చులు రైతు నుండి తీయడం కారణంగా వరంగల్ మార్కెట్ కు రైతులు పంటను తీసుకురాకుండా గ్రామాలలో ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. మార్కెట్ కు వచ్చే ఆదాయం రాకపోవడం పంటలు రాక మార్కెట్ విలవిలలాడుతోందన్నారు. రైతుల పంటను మార్కెట్ కు రావాలంటే రైతులపై ఖర్చుల భారాన్ని తగ్గించాలి పంటలకు సరైన ధర వచ్చేవిధంగా చూడాలి మార్కెట్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని మెమోరాండంలో చైర్మన్ ను కోరారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఎదురవుతున్న సమస్యలు వాస్తవమేనని.. 60 రోజుల్లోనే కొన్ని సమస్యలు పరిష్కరించే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి జనార్ధన్, డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, గాజుల శ్యామ్ తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు ఊరటి అంశాలరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోకిడ పీరయ్య, బరపటి రవీందర్, సోమిడి సాంబయ్య, బొల్లు ఎల్లయ్య, మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీల పనివేళల్లో మార్పు

హనుమకొండ, ఆయుధం: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో పనివేళలు మార్చారు. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు డిగ్రీ కాలేజీలు కొనసాగుతున్నాయి. తాజా ఆ పనివేళలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 వరకు పరిమితం చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, ప్రిన్సిపల్ సెక్రెటరీ విజయేంద్ర బోయి కి, సెక్రటరీ కంభంపాటి శారద, ఓఎస్డి డాక్టర్ స్నేహలత కు కృతజ్ఞతలు తెలియజేస్తూ టిగారియా అధ్వర్యంలో డిగ్రీ లెక్చరర్లు సంబరాలు జరుపుకున్నారు. అధ్యాపకుల పని భారం సమతుల్యం చేయడమే కాకుండా విద్యా ప్రమాణాలు మెరుగుదలకు, కళాశాలల సమర్థ నిర్వహణకు దోహదపడుతుందని టిగారియా డిగ్రీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఐ.రాధిక, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.సత్య శ్రీదేవి పేర్కొన్నారు.

ముందస్తుగా విత్తనాలు పెట్టొద్దు

- తగిన వర్షా లు కురిసే వరకు చూడాలి
- డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పరకాల మండల అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు

పరకాల, ఆయుధం: ప్రస్తుతం పరకాల ప్రాంతంలో కొనసాగుతున్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో రైతులు ముందస్తుగా విత్తనాలు వేయకుండా జాగ్రత్తలు పాటించాలని పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ & సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత కొద్ది రోజులుగా పరకాల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 38 నుంచి 39 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయని, బయట ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు పైగా ఉంటోందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తొందరపడి విత్తనాలు విత్తడం వల్ల తీవ్ర నష్టాలు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు.

ప్రస్తుతం నేలలో తగిన తేమ లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తడానికి అవసరమైన అనుకూల పరిస్థితులు లేవని వివరించారు. నేలలో కనీసం నాలుగు నుంచి ఐదు అంగుళాల లోతు వరకు తేమ, చల్లదనం ఉన్నప్పుడే విత్తనాలు సక్రమంగా మొలకెత్తుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నేల పైభాగం పూర్తిగా పొడిగా ఉండటంతో పాటు లోపల కూడా అధిక వేడి కొనసాగుతోందని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పత్తి, సోయాబీన్, పెసర, కంది వంటి పంటల విత్తనాల్లో మొలక శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. 38 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నేల ఉష్ణోగ్రత ఉన్న పరిస్థితుల్లో విత్తనాల జీవశక్తి దెబ్బతిని మొలక శాతం 30 నుంచి 40 శాతం వరకు తగ్గిపోతుందని చెప్పారు.

మొలకలు రాకపోతే రైతులు మళ్లీ భూమిని దున్నడం, తిరిగి విత్తనాలు కొనుగోలు చేయడం, కూలీలను పెట్టుకోవడం వంటి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీంతో ఎకరాకు రూ.2,500 నుంచి రూ.4,000 వరకు అదనపు భారం పడే అవకాశముందని, పంట సాగు కూడా 15 నుంచి 20 రోజులు ఆలస్యమవుతుందని వివరించారు.

కనీసం 25 నుంచి 30 మిల్లీమీటర్ల వర్షపాతం ఒకేసారి కురిసిన తర్వాతే విత్తనాలు విత్తడం ఉత్తమమని సూచించారు. అప్పుడు నేలలో తగిన తేమ ఏర్పడి విత్తనాలు ఏకరీతిగా మొలకెత్తడంతో పాటు పంట ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని, తెగుళ్ల సమస్యలు కూడా తగ్గే అవకాశముందని తెలిపారు.

రైతులు మరో రెండు మూడు రోజులు ఓపిక పట్టి వాతావరణ శాఖ సూచనలను గమనించాలని, పొలంలో నాలుగు అంగుళాల లోతు వరకు మట్టి తేమను పరిశీలించిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని సూచించారు. వర్షాలు కురిసిన వెంటనే అవసరమైన విత్తనాల సరఫరాకు డీలర్ల వద్ద తగిన నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గందె వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వ్యవసాయంలో తొందరపాటు నిర్ణయాల కంటే శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నష్టాలను నివారించవచ్చని, రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన కోరారు

సబ్సిడీపై సన్నాలు

(మొదటి పేజీ తరువాయి..)

సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని చెప్పారు.

రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ : ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతు వేదికలను పూర్తిగా రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695